# నమ్మిన రైతులను నట్టేట ముంచిన్రు

హామీల అమలులో సీఎం ఘోర వైఫల్యం

- అబద్ధాలతో రేవంత్ పాలన
- ఎన్నికలకు ముందో మాట.. ఇప్పుడో మాట
- రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలి
- రైతు భరోసా అమలు చేస్తారా? లేదా?
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం



కరీంనగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 16 : అలవికాని హామీలతో ఎన్నికల్లో ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ నమ్మి ఓట్లేసిన రైతులను నట్టేట ముంచిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. అబద్ధాలతో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అవే అబద్ధాలతో పరిపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందో మాట.. గెలిచిన తర్వాత మరో మాట మాట్లాడుతూ, రైతులకిచ్చిన హామీలు అమలు చేయడంలో అత్యంత హోరంగా వైఫల్యం చెందిన ఘనత దక్కించుకున్నారని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు లెక్కలు, తప్పుడు మాటలతో సీఎం రేవంత్ రాష్ట్ర రైతాంగాన్ని ఘోరంగా మోసం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఏకకాలంలో ₹2 లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలకు పోయారని, మూడు విడుతల్లోనూ పూర్తిస్థాయిలో చేయకపోవడం రైతులపై ఆ పార్టీకున్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2014లో ₹లక్షలోపు రుణాల మాఫీకి ₹16,144 కోట్లు వెచ్చించి, 35 లక్షల మంది రైతులకు, 2018లో లక్షలోపు రుణమాఫీ కోసం ₹19,198 కోట్లు వెచ్చించి, 37 లక్షల మంది రైతులు తీసుకున్న రుణాలు చెల్లించిందని గుర్తు చేశారు. ₹లక్ష రుణమాఫీలో బీఆర్ఎస్ సర్కారుతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ₹2 లక్షల రుణమాఫీ ఏ మేరకు చేసిందో స్పష్టమవుతుందన్నారు. రైతు రుణమాఫీలో అడ్డగోలు కోతలు పెట్టి 46.25 లక్షల మంది రైతుల కడుపులు కొట్టిందని ధ్వజమెత్తారు. రెండు విడుతల్లో రుణమాఫీ కానీ రైతులంతా మూడో విడుత కోసం ఎదురుచూస్తుండగా, కేవలం 6 లక్షల మందికి మాత్రమే వర్తింపజేసి, చేతులు దులుపుకోవడం దుర్మార్గమని అన్నారు. బీఆర్ఎస్ హయాంతో పోలిస్తే 13 లక్షల మంది రైతులను అనర్హులుగా పేర్కొంటూ, కాంగ్రెస్ రుణమాఫీకి దూరం చేసిందని మండిపడ్డారు. జూలై 18న మొదటి విడుతలో 11.34 లక్షల మంది ₹లక్ష లోపు రుణాలున్న రైతులకు ₹6 వేల కోట్లు, జూలై 30న విడుదల చేసిన రెండో విడుతలో ₹1.50 లక్షలలోపు రుణాలున్న 6.40 లక్షల మందికి ₹6,190 కోట్లు మాఫీ చేసిందని, మొత్తంగా 23.75 లక్షల మందికి ₹18,190 కోట్లు మాత్రమే మాఫీ చేసి, మొత్తం రైతాంగానికి రుణమాఫీ చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. పాసుబుక్కు ప్రామాణికంగా రుణమాఫీ చేస్తామంటూ ముందుగా ప్రకటించి, తర్వాత రేషన్‌కార్డు ప్రామాణికంగా మాత్రమే రుణమాఫీ చేయడం వెనుక ఆంతర్యమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశచరిత్రలో రైతులను ఇంత ఘోరంగా మోసం చేసిన ప్రభుత్వం ఎక్కడా లేదన్నారు.

### రైతు భరోసా ఏమైంది?

రైతుల సంక్షేమం కోసం వ్యవసాయరంగ బలోపేతమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసింది. కానీ, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టే అంతర్గత కుట్రతో కాంగ్రెస్ పాలన సాగిస్తున్నది. వెంటనే రాష్ట్రంలోని యావత్ రైతాంగానికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి. రైతుబంధును రైతు భరోసాగా మారుస్తూ, ఏటా ఎకరాకు ₹15 వేల పెట్టుబడి సాయంగా అందిస్తామంటూ ఇచ్చిన హామీ ఏమైందో చెప్పాలి. రైతుకు భరోసా ఉన్నట్లా? లేనట్లా? మరోవైపు కౌలు రైతులు, రైతు కూలీల పరిస్థితి కూడా దయనీయంగా తయారైంది.

- కొప్పుల ఈశ్వర్

### సీఎం మాటల్లో పొంతన లేదు : సుంకె

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు మాట్లాడిన మాటలు, గెలిచిన తర్వాత అసెంబ్లీలో మాట్లాడిన తీరు, రుణమాఫీ చేసిన తీరుకు ఏమాత్రం పొంతన లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. రుణమాఫీపై వ్యవసాయశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు పరస్పర విరుద్ధంగా ఉండడమే రైతు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును రాజీనామా చేయాలనడం సీఎం అవివేకానికి నిదర్శనమన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సంస్కారహీనమైన వ్యాఖ్యలు చేయడం రేవంత్‌కే చెల్లిందన్నారు. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని ఎద్దేవా చేశారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా, రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

## వంతెన ఇలా.. పోయేదెలా?



వర్షాలతో గుంతలమయమైన మోతె వంతెన

రామడుగు మండలంలోని మోతె వాగుపై ఉన్న బ్రిడ్జి పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. మోతె, రుద్రారం, రంగశాయిపల్లి, దత్తోజిపేట, లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లి, గోలిరామయ్యపల్లి, కొరటపల్లి గ్రామాల ప్రజలు దీనిపై నుంచే జిల్లా కేంద్రానికి వెళ్లాలి. గతేడాది భారీ వరదలకు బ్రిడ్జి కొట్టుకు పోవడంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం వంతెనపై మట్టిపోసి తాత్కాలిక ఏర్పాట్లు చేసింది. కాగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వంతెనపై పోసిన మట్టి కొట్టుకుపోయి భారీగా గుంతలు పడడంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు అవకాశం లేకుండా తయారైంది.

- రామడుగు, ఆగస్టు16



# ఎల్‌ఎండీ వెలవెల

- ఎస్సారెస్పీ నుంచి ఎగువ ఆయకట్టుకే నీటి విడుదల
- కాళేశ్వరం ఎత్తిపోతలు నడుస్తున్నా దిగువ మానేరుకు రాని జలాలు ?
- ప్రస్తుతం డ్యాంలో 5.5 టీఎంసీలే నిల్వ
- తాగునీటికే సరిపోవంటున్న అధికారులు
- తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్న ఆయకట్టు రైతులు
- సాగునీటి కోసం ఎదురు చూపులు

**లోయర్ మానేరు డ్యాం జలాశయం అట్టడుగుకు చేరుకున్నది. పోయినేడు ఇదే సమయానికి నిండుగా కళకళలాడినా ఎల్‌ఎండీ, ఇప్పుడు వెలవెలబోతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఈ జలాశయానికి గతేడాది నీటిని విడుదల చేసినా, ఇప్పుడు నిర్లక్ష్యం కనిపిస్తున్నది. దాదాపు 25 రోజులుగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మధ్యమానేరుకు 14 టీఎంసీలకుపైగా పోత్తిపోసి, ఎగువకు తరలిస్తుండడంతో తమకెప్పుడు ఇస్తారని ఎల్‌ఎండీ ఆయకట్టు రైతాంగం ప్రశ్నిస్తున్నది. ప్రస్తుతం డ్యాంలో ఉన్న 5.5 టీఎంసీల నీరు తాగునీటి అవసరాలకే సరిపోదని, పంటల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నది. ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాలని కోరుతున్నది.**

కరీంనగర్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): దిగువ మానేరు జలాశయం (ఎల్‌ఎండీ) దయనీయ స్థితికి చేరింది. దీని పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.449 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. గతేడాది ఇదే సమయానికి 23 టీఎంసీల నీరు ఉన్నది. పోయినేడు అధిక వర్షాలతో మోయతుమ్మెద వాగు నుంచి 1,500 క్యూసెక్కుల వచ్చింది. ఇప్పుడా పరిస్థితి లేదు. జలాశయం డెడ్ స్టోరేజీ 3 టీఎంసీలు కాగా, అదనంగా 2.4 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా కరీంనగర్, వరంగల్ నగరాలతోపాటు మిషన్ భగీరథ కింద కరీంనగర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాలు, సిద్దిపేట పట్టణ తాగునీటి అవసరాలకే సరిపోనున్నాయి. ఈ నేపథ్యంలో జలాశయంలో నీటిమట్టం పెరిగితే గానీ, సాగునీటి కోసం వాడుకునే అవకాశం లేదు. ఎల్లంపల్లి ద్వారా ఎత్తిపోతలతో మధ్యమానేరు నింపుతున్న అధికారులు ఎల్‌ఎండీకి ఇప్పటి వరకు నీటిని విడుదల చేయాలనే ఆలోచన చేయడం లేదు. గత నెల 27 నుంచి మధ్యమానేరుకు నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటి వరకు 14 టీఎంసీలకు పైగా నీటిని తరలించిన అధికారులు, అటు నుంచి అన్నపూర్ణ, సిద్దిపేటలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్లకు 6,462 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కానీ, ఎల్‌ఎండీకి నీటిని తరలించే విషయంలో తాత్సారం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితిలోనే నీటిని తరలిస్తేనే పంటలకు అవసరమైనప్పుడు నీటిని విడుదల చేసుకోవచ్చని రైతులు భావిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు పడితేనే రిజర్వాయర్‌కు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నట్టు తెలుస్తుండగా, ఒక వేళ వర్షాలు పడకపోతే తమ పరిస్థితి ఏంటని దిగువ మానేరు ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు.

### ఎగువ కాలువకు నీటి విడుదల

పోయినేడు ఇదే సమయానికి ఎస్సారెస్పీలో 50 టీఎంసీల నీరు ఉండగా, ఆయకట్టు పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో 9.40 లక్షల ఎకరాలకు నీళ్లందించారు. రెండు సీజన్లకు మొత్తం 58.082 టీఎంసీల నీటిని సరఫరా చేస్తే.. అందులో కాళేశ్వరం నుంచి ఎత్తిపోసి ఎల్‌ఎండీ ద్వారా 47.567 టీఎంసీల నీటిని తరలించారు. కరీంనగర్ జిల్లాలో పరిశీలిస్తే కాకతీయ దిగువ కాలువ 122.450 కిలో మీటర్ నుంచి 144.175 వరకు, 146 నుంచి 202.178 కిలో మీటరు వరకు 1,31,352 ఎకరాలకు సాగునీరిచ్చారు. యాసంగిలో కూడా ఇంచుమించు ఇదే స్థాయిలో దిగువ ఆయకట్టుకు నీళ్లు అందించారు. కానీ, ఈ సారి ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ నెల 7న ఎల్‌ఎండీ ఎగువన కాలువకు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేశారు. 0 నుంచి 146 కిలో మీటర్ వరకు ఉన్న డిస్ట్రిబ్యూటర్లకు అంటే జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలతోపాటు కరీంనగర్ జిల్లా చొప్పదండి, కరీంనగర్ నియోజవర్గాల పరిధిలోని 4.27 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందిస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 48 టీఎంసీల నీరు ఉండగా, అందులో 30 టీఎంసీల వరకు సాగుకు వినియోగిస్తామని అధికారులు చెబుతున్నారు. మిగతా 10 టీఎంసీల నీరు తాగు నీటి అవసరాలకు నిల్వ చేయనున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి కూడా వరద తగ్గింది. ఎగువ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా పడితే గానీ ప్రాజెక్టులోకి నీరు వచ్చే అవకాశం లేదు. వర్షాలు ఎపుడు అనుకూలిస్తాయో..? తెలియదు. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తున్న నీటిని ఎల్‌ఎండీ జలాశయానికి తరలించడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు తరలించినట్టుగానే తమకు కూడా నీటిని తరలించాలని ఎల్‌ఎండీ దిగువ ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తుండగా, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది.

### ఇదీ ఆయకట్టు పరిస్థితి

ఎల్‌ఎండీ ఆయకట్టులో ప్రస్తుతం వరి నాట్లు ముగింపు దశకు వచ్చాయి. ఇప్పటికే 80 శాతానికి పైగా నాట్లు పడ్డాయి. 1.30 లక్షల ఎకరాలకుపైగా నాట్లు పడే అవకాశాలు ఉన్నాయి. వర్షపాతం తక్కువగా ఉండి కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగలేదు. చెరువులు, కుంటల్లోకి నిరుడిలా పూర్తి స్థాయిలో నీరు రాలేదు. ప్రస్తుతం బావులు, బోర్లపై ఆధారపడి నాట్లు వేస్తున్నారు. కొన్ని మండలాల్లో ఇప్పటికిప్పుడు నీటి సమస్య రాకున్నా.. పరిస్థితి ఇలాగే ఉంటే మాత్రం పంట చేతికొచ్చే సమయంలో ప్రాజెక్టు నీరు తప్పకుండా అవసరముంటుందని రైతులు చెబుతున్నారు. అప్పుడు నీటిని విడుదల చేయకుంటే పంటలు ఎండిపోయే ప్రమాదముంటుంది. ఈ పరిస్థితుల్లో అధికారులు ముందస్తుగా ఎల్‌ఎండీ జలాశయాన్ని నింపాల్సిన అవసరమున్నది.

### వర్షాలు అనుకూలిస్తే విడుదల చేస్తాం

ప్రస్తుతం ఎస్సారెస్పీ పరిస్థితి ఆశా జనకంగా లేదు. కేవలం 48 టీఎంసీల నీరే ఉన్నది. ఎగువ ప్రాంత పంటల కోసం 30 టీఎంసీలు విడుదల చేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయించాం. ఎల్‌ఎండీలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే నీరున్నది. మధ్యమానేరులో ప్రస్తుతం 15.58 టీఎంసీలే ఉంది. మధ్యమానేరులో 20 నుంచి 25 టీఎంసీల నీరు చేరితే ఎల్‌ఎండీకి విడుదల చేయవచ్చు. ఇప్పటికిప్పుడు ఎల్‌ఎండీకి నీళ్లు మళ్లించే పరిస్థితి లేదు. వర్షాలు అనుకూలించి ఆశించిన నీరు చేరితే తప్పకుండా దిగువ ఆయకట్టుకు నీళ్లు విడుదల చేస్తాం.

- శంకర్, ఎస్సారెస్పీ ఈఎన్సీ



బోయినపల్లి : వేములవాడ వెళ్లే దారిలో వంతెన పైనుంచి వెళ్తున్న వరద

# జోరువాన

- ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షం
- పూడూర్‌లో అత్యధికంగా 87 మిల్లీమీటర్లు
- జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై విరిగిన చెట్టు.. గంటలకొద్దీ నిలిచిన ట్రాఫిక్

కరీంనగర్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శుక్రవారం కుండపోత కురిసింది. సాయంత్రం అక్కడక్కడ భారీ వాన పడింది. జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూర్‌లో అత్యధికంగా 87.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మల్లాపూర్ మండలంలో 77.3, ధర్మపురి మండలం నేరెళ్లలో 68.3, బుర్దేశ్‌పల్లిలో 67.0, జగిత్యాల జిల్లా కేంద్రంలో 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొడిమ్యాల మండలంలోని కోనాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో దాటలేని పరిస్థితి నెలకొన్నది. తుర్కాశీనగర్ శివారులో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. ఇదే సమయంలో నమిలికొండ శివారులో వేసిన రైల్వేగేటు మొరాయించింది. దీంతో రహదారిపై గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి.

- కరీంనగర్‌లో రెండు గంటల పాటు వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. గంగాధర సమీపంలో ని మధురానగర్ వద్ద కరీంనగర్, జగిత్యాల రహదారి పైచెట్టు విరిగిపడి కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి రోడ్లపై వరద ప్రవహించింది. ఇటు శంకరపట్నం మండలంలో కూడా ఇదే పరిస్థి తి పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయంగా మారాయి. కేశవపట్నంలో అయితే మోకాలు లోతుతో వరద నీరు ప్రవహించింది. తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం మండలాల్లో కూడా భారీ వర్షం కురిసింది. గన్నేరువరంలో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షానికి పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.
- సిరిసిల్ల పట్టణంలో సాయంత్రం 4గంటలకు భారీ వాన పడింది. తర్వాత ముసురు అందుకుంది. దాదాపు అన్ని మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా సిరిసిల్ల పట్టణంలో 40.6 మిల్లీ మీటర్లు, ముస్తాబాద్ 20.9, ఇల్లంతకుంట 8.4, వీర్నపల్లి 29.1 కోనరావుపేట 0.2, రుద్రంగి 4, చందుర్తి 10, వేములవాడ రూరల్ 11.3, బోయినిపల్లి 18.2, వేములవాడ 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.




నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

## నేడు ప్రైవేట్ దవాఖానలు బంద్

- 24గంటలపాటు ఓపీ సేవలు నిలిపివేత
- కోల్‌కతా వైద్యురాలి ఘటనకు నిరసన

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 16 : కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా నేడు దేశవ్యాప్తంగా ప్రైవేట్ దవాఖానలను బంద్ చేయనున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 6 నుంచి 24 గంటలపాటు ఓపీ వైద్యసేవలు నిలిపివేయనున్నారు. ఈ మేరకు కరీంనగర్ ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని చెప్పారు. అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందిస్తామని తెలిపారు. తాము చేస్తున్న శాంతియుత బంద్‌కు ప్రజలు, పేషెంట్స్ సహకరించాలని కోరారు. కరీంనగర్ ఐఎంఏ శాఖ చేపట్టనున్న ధర్నాకు మెడికల్ రిప్‌లు మద్దతు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్స్ కరీంనగర్ శాఖ కార్యదర్శి అంజయ్య మిరుపాల తెలిపారు.

### వైద్యుల నిరసన

విద్యానగర్, ఆగస్టు 16 : కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిపై జరిగిన అమాను ఘటనపై వైద్యులు నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. శుక్రవారం ఉదయం కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. న్యాయం జరిగేంత వరకు ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. నిందితులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎంఈడీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 16 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎంఈడీ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా జూన్‌లో నిర్వహించిన ఎంఈడీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు యూనివర్సిటీ ఫలితాల కోసం http://103.119.113.107:86, www.satavahana.ac.in.లో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

## అనాథలుగా నమ్మించి.. బిడ్డలను అమ్మిన తల్లి!

ప్రియుడితో కలిసి ఇద్దరు ఆడపిల్లల విక్రయం

**బాలుడి కిడ్నాప్ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి**



**పిల్లను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన ఆ తల్లి కాఠిన్యం చూపింది. రెండేళ్ల క్రితం భర్తతో విడిపోయి మరొకరితో ఉంటున్న ఆ మహిళ, తన ఇద్దరు ఆడబిడ్డలను అనాథలుగా నమ్మించి అమ్మినట్టు తెలుస్తున్నది. ఇటీవల మెట్‌పల్లిలో రెండేళ్ల బాలుడి కిడ్నాప్‌నకు యత్నించిన ఉదంతంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తుండగా, విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి.**

మెట్‌పల్లి, ఆగస్టు 16: విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం పోతంగల్‌కు చెందిన లావణ్యకు, అదే జిల్లా సారంగాపూర్‌కు చెందిన ఓ వ్యక్తితో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు బిడ్డలు. ఒకరికి ఆరేళ్లు, మరొకరికి మూడేళ్లు. లావణ్య దాదాపు రెండేళ్ల కిందట తన భర్తతో విడిపోయి, ఇద్దరి పిల్లలతో కలిసి ఎడపల్లిలో ఉంటున్నది. అక్కడ బంధువుల ఇంకి వచ్చి పోయే ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేటకు చెందిన ఇస్లావత్ నగేశ్ (32)తో పరిచయం ఏర్పడింది. కొంతకాలం నుంచి అతడితో కలిసి మెట్‌పల్లిలోని ఓ చావిడి ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నది. పట్టణంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో క్లీనర్‌గా పనిచేస్తున్నది. మొదటి భర్తతో కలిగిన సంతానం భారమని భావించిందో.. లేదా వదిలించుకోవాలనుకున్నదో.. డబ్బులు పోగేసుకుందామన్నదో తెలియదు గానీ, ఆ ఇద్దరు ఆడపిల్లలపై కర్కశత్వం చూపింది. ప్రియుడితో కలిసి బిడ్డలను అమ్మాలని అనుకున్నది. అనాథలని నమ్మించి మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో ఒకరికి ఆరేళ్ల బాలికను ₹2 లక్షలకు, మెట్‌పల్లి పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెంది న ఒకరికి మూడేళ్ల బాలికను ₹1.50 లక్షలకు గత జూన్‌లో అమ్మినట్టు తెలిసింది. ఇదే క్రమం లో బాబు కావాలని ఒకరు అడగగా.. ₹1.50 లక్షలకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నది. ఆమె పథకం ప్రకారం.. ఈ నెల 13న నగేశ్ మెట్‌పల్లి దుబ్బవాడలో రెండేళ్ల బాలుడి కిడ్నాప్ చేసి దొరికిపోయాడు. కిడ్నాప్, పిల్లల విక్రయంపై పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతుండగా, ఇద్దరు బిడ్డలను అమ్మిన విషయం వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది.

### నగేశ్‌దీ నేరస్వభావమే..

జల్సాలకు అలవాటైన నగేశ్ డబ్బుల కోసం క్రమంగా దొంగగా, కిడ్నాపర్‌గా మారాడు. మొదట పేకాట బానిసై, డబ్బుల కోసం అడ్డదారులు తొక్కాడు. రైతులు కల్లాల వద్ద నిల్వ చేసుకున్న పసుపు, ఇతరత్రా పంట ఉత్పత్తులను, బైక్‌లను ఎత్తుకెళ్లి అమ్ముకునేవాడు. గంజాయి కూడా విక్రయించేవాడు. చైన్ స్నాచింగ్ చేసేవాడు. పలు చోరీల కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడు. తన భర్త దొంగ అని తెలిసి మూడేళ్ల క్రితం నగేశ్ భార్య విడాకులిచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే భర్తతో విడిపోయిన లావణ్యతో నగేశ్ ఉంటున్నాడు. అయితే ఈ నెల 13న బాలుడిని కిడ్నాప్ చేసి అడ్డంగా దొరికి పోయాడు.

**శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ అడ్మిషన్ల జోరు తగ్గడంతో పలు కళాశాలల యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి. యూనివర్సిటీ స్థాయిలో దాదాపు 80 వరకు ప్రైవేటు కళాశాలలు ఉండగా, పదుల సంఖ్యలో కళాశాలలకు అదే పదుల సంఖ్యలో అడ్మిషన్లు వచ్చినట్టు తెలుస్తున్నది. అయితే, సాంకేతిక విద్యకు ఆదరణ పెరడంతో డిగ్రీ విద్యకు తగ్గుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.**

# డిగ్రీ అడ్మిషన్ల జాడేది?

- కొన్నింటిలో పదుల సంఖ్యలోనే చేరిక
- నిర్వహణ భారంలో ప్రైవేటు కళాశాలలు
- తలలుపట్టుకుంటున్న యాజమాన్యాలు



కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఆగస్టు 16 : డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతూ వస్తున్నాయి. డిగ్రీ ప్రవేశాల్లో శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 2021-22లో 26,166 అడ్మిషన్లు రాగా, 2022-23లో 20,218 అడ్మిషన్లు, 2023-24లో 16,419 అడ్మిషన్లు వచ్చాయి. ఈ సంఖ్య ఈ యేడాది మరింత తగ్గి 15,950కు పడిపోయాయి.

### ఆకట్టుకున్న వారికే అడ్మిషన్లు!

డిగ్రీ ప్రవేశాల్లో విద్యార్థులను ఆకట్టుకున్న కళాశాలలకే అడ్మిషన్లు వస్తున్నట్లు తెలుస్తున్నది. అడ్మిషన్ల సమయంలో కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులను ప్రలోభాలకు గురిచేసి అడ్మిషన్లు తీసుకువచ్చుకుంటే, మరి కొన్ని కళాశాలలు నిర్వహణ భారమై వాటి జోలికి పోలేదు. దీంతో ఆ కళాశాలలకు అడ్మిషన్లు పూర్తిగా తగ్గినట్టు తెలుస్తున్నది. అలాగే, పలు ప్రభుత్వ కళాశాలలకు కూడా అడ్మిషన్ల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. అయితే, తక్కువ అడ్మిషన్లు వచ్చిన కళాశాలలో కోర్సును బట్టి సీట్లను మరో కళాశాలలో ఉన్న కోర్సులతో కలుపుతారు.

### నిర్వహణ భారం తట్టుకునేదెలా?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో ఫీజులు విద్యార్థుల నుంచి తీసుకోకుండా, విద్యార్థులకు వచ్చిన స్కాలర్‌షిప్‌లను ఫీజులుగా తీసుకుంటూ కళాశాలలను నెట్టుకొస్తున్నారు. అయితే, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత స్కాలర్‌షిప్ నగదు ఇంకా విడుదల కాకపోగా, వాటి గురించి ప్రభుత్వం మాట్లాడకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయంలో కళాశాలల యాజమాన్య సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ద్వారా ముఖ్యమంత్రికి సైతం వినతి పత్రం సమర్పించినట్లు తెలుస్తున్నది.